అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

ఆదివారం 22 జనవరి 2023

భవానీపేట్‌లో పశువైద్య శిబిరం



పశువులకు చికిత్స

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని భవానిపేట గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించినట్టు పశు వైద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువైద్య శిబిరంలో 35 పశువులకు గర్భాశయ చికిత్సలు 17 పశువులకు సాధారణ చికిత్సలు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుతోట నరసమ్మ, ఉప సర్పంచ్ కొలిమికుమార్, ఎంపీటీసీ ఆకుల సురేందర్, ప్రకాష్, గోపాలమిత్ర, సూపర్‌వైజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రిలయన్స్ జీఓ, వీల్ఆర్ కంపెనీ, అనంత నిలయం, ఐటీసీ, ఐటీటీ, విజయ బయో ఫర్టిలైజర్, మొదలగు సుమారు 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిగ్రీ డిప్లొమా, ఐటీఐ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే జాజుల సురేందర్, జిల్లా అధికారులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

పోరాడితే.. పోయేదేం లేదు

- కామారెడ్డిలో మాస్టర్‌ప్లాన్ రద్దు
- రైతు పోరుకు దిగొచ్చిన సర్కారు
- మంచిప్ప ప్రాజెక్టుపై పోరుబాట
- కామారెడ్డి పోరు విజయంతో ఉత్సాహం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి





మాస్టర్‌ప్లాన్ రద్దుతో కామారెడ్డిలో సంబరాలు.. మంచిప్ప రిజర్వాయర్ వద్దంటు నిరసన

వీక్లి రౌండప్

'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ల తప్ప' అన్న నానుడిని నిజం చేశారు కామారెడ్డి జిల్లా రైతులు. వివిధ పద్ధతుల్లో పోరుబాట చేపట్టి విజయం సాధించారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లా రైతులు సాధించిన విజయం.. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పోరు విజయం ఉత్సాహంతో మరింతమంది రైతులు ఆందోళన బాట పడుతున్నారు. కామారెడ్డిలో సాధించిన విజయంతో నిజామాబాద్‌లోని రైతులు మరోసారి పోరుబాట పట్టారు. మంచిప్ప రిజర్వాయర్ రీడిజైన్ మార్చాలని ఆందోళన చేపట్టడం విశేషం.

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలంటూ ఆ జిల్లా రైతులు చేపట్టిన పోరాటం విజయం సాధించింది. రైతుల పోరాటానికి రాష్ట్రప్రభుత్వం దిగివచ్చింది. అత్యవసరంగా భేటీ అయిన మున్సిపల్ కౌన్సిల్ ఈ మేరకు ఏకగ్రీవంగా మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తూ తీర్మానించింది. ప్రస్తుతం ఆ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన గ్రీన్ జోన్, ఇండస్ట్రియల్ జోన్ రద్దు చేయాలని గత కొన్ని నెలలుగా రైతులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే పోరాటానికి వివిధ పద్ధతులను అనుసరించారు. మొదట వినతిపత్రాల అందజేతతో మొదలైన ఉద్యమం.. చివరకు ప్రజాప్రతినిధుల ఇండ్ల ముట్టడి వరకు సాగింది. ఈ క్రమంలో ఉద్యమం నీరుకారకుండా రైతులు జాగ్రత్తలు వహించారు. ఐక్య కార్యాచరణ కమిటీ పేర రైతులందరూ ఒకే వేదికపైకి వచ్చారు. రాజకీయ జెండా, అజెండాలను పక్కన పెట్టి ఉద్యమం కొనసాగించారు. రాజకీయ నాయకుల అజెండా మేరకు ఉద్యమాలు సాగే పరిస్థితి నుంచి.. రైతుల ఉద్యమాల ఆధారంగా రాజకీయ నాయకులు కలిసి వచ్చే పరిస్థితి వరకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో వరుసగా భేటీలు జరిపిన ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు.. ఎప్పటికప్పుడు వ్యూహాలు రచిస్తూ.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించారు. కలెక్టరేట్ ముట్టడి కార్యాలయం నుంచి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఆ తరువాత మున్సిపల్ ముట్టడి.. ఇక 20వ తేదీన ప్రతిపాదించిన ఎమ్మెల్యే ఇంటి ముట్టడితో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఒక రోజు ముందుగానే కౌన్సిల్ సమావేశమై మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తూ తీర్మానించింది.

కామారెడ్డి రైతులు చేపట్టిన ఉద్యమం.. వచ్చిన ఫలితంతో మిగతా జిల్లా రైతులు సైతం తమ సమస్యలపై పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా మంచిప్ప భూనిర్వాసితులు ఉద్యమం చేపట్టారు. మంచిప్ప రిజర్వాయర్ రీడిజైన్ మార్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టారు. మొదటి నుంచి ఈ ఉద్యమం సాగుతున్నప్పటికీ.. రాజకీయ నాయకుల ప్రకటనలు, రాష్ట్ర ప్రభుత్వం వేచిచూసే ధోరణితో ఉద్యమం కొంత నిలిచిపోయింది. కానీ కామారెడ్డి రైతులు సాధించిన విజయం స్ఫూర్తితో ఈ రైతులు సైతం సమస్య పరిష్కరించే వరకు పోరుబాట వీడబోమని స్పష్టం చేస్తున్నారు. రీడిజైనింగ్ రద్దు చేసి పాత పద్ధతుల్లో పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

శ్రీనిధి బ్యాంకు లింకేజీతో
సోలార్ యూనిట్లకు రుణాలు

- కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకునే విధంగా ఐకెపి అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఐకెపి అధికారులతో బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాల వసూళ్లు, సోలార్ వినియోగం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు చెల్లించవలసిన అవసరం ఉండదని తెలిపారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. సోలార్ యూనిట్ల కోసం మహిళలను ఎంపిక చేయాలని కోరారు. ఫిబ్రవరి 10లోగా 100 శాతం బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు వసూలు చేపట్టాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తేనెటీగలు, చేపలు, గేదెల, కోళ్ల, కూరగాయల పెంపకం వంటి యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా అధికారులు చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డిఆర్ డిఓ సాయన్న, ఎల్డిఎం చిందం రమేష్, మెప్మా పిడి శ్రీధర్ రెడ్డి, డీపీఎంలు సుధాకర్, రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులందరికీ
ఇండ్లస్థలాలు, డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, బీడీ కార్మికులు

నవతెలంగాణ-జుక్కల్

నియోజకవర్గంలోని ఆరు మండలాల బీడీ కార్మికులకు ఇండ్ల స్తలాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సురేశ్‌గొండ డిమాండ్ చేశారు. శనివారం జుక్కల్ మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీలో జుక్కల్ మండల బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చంద్రకళ, ప్రధాన కార్యదర్శిగా యు. సులోచన, ఉపాధ్యక్షులుగా సునిత, కోశాధికారిగా డి.బాగ్యలక్ష్మీ, సహయ కార్యదర్శిగా ప్రియాంక, రుక్మిని, స్వరూప, నిర్మల, రమాదేవి, లక్ష్మీబాయిని ఎన్నుకున్నారు.

మార్క్సిజమే శ్రామికవర్గ విముక్తికి మార్గం

- ఆచరణలో పెట్టి నిరూపించిన వ్యక్తి లెనిన్..
- వర్థంతి పురస్కరించుకొని నివాళి అర్పించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్



నిజామాబాద్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో..



బోధన్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రపంచంలో శ్రమ దోపిడీ విముక్తికి మార్గాన్ని కారల్ మార్క్స్ నిర్దేశిస్తే దాన్ని ఆచరణలో పెట్టి మార్క్సిజం అజేయమని అదే శ్రామిక వర్గ విముక్తికి మార్గమని నిరూపించిన వ్యక్తి లెనిన్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ శ్రమదోపిడీకి గురవటానికి పెట్టుబడిదారీ వ్యవస్థ కారణమని పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమకు తగిన ఫలితం రాకుండా కార్మికులు కష్టజీవులు నిత్య దరిద్రాన్ని అనుభవిస్తున్నారని దాన్ని అంతమొందించడానికి కారల్‌మార్క్స్ సిద్ధాంతాన్ని రూపొందిస్తే జీవితంలో ఆచరించి రష్యాలో సోషలిజం సాధించటానికి ఆచరణలో పెట్టి దోపిడీ లేని వ్యవస్థను నిర్మించారని నేటికీ మార్క్సిజం అజేయంగా నిలవడానికి లెనిన్ చూపిన బాట ఆచరణ మార్గ నిర్దేశిస్తున్నది అని అన్నారు. మార్క్సిజాన్ని ఆచరించడానికి కార్మిక వర్గం నాయకత్వంలోని వర్గాల ప్రజలను కలుపుకొని విప్లవం సాధించటం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందని అందు కోసం ఏం చేయాలి అనే పుస్తకంలో ఆయన తన అనుభవాలను క్రోడీకరించి రాశారని తెలిపారు. లెనిన్ చూపిన ఆచరణను అనేక దేశాలు పాటించటం వల్లనే పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్‌రాములు, జిల్లా కమిటీ సభ్యులు పిసూరి, నగర నాయకులు డి కృష్ణ, గోవర్ధన్, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : లెనిన్ 99 వ వర్ధంతి పురస్కరించుకొని బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్ప, జిల్లా నాయకులు గంగామణి , తిరునగరి శశికళ, జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నీరడి గంగామణి, గాండ్ల. శంకర్, ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులపై దౌర్జన్యం

- అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా మంచిప్ప భూనిర్వాసిత నాయకుల అరెస్ట్
- ఖండించిన నాయకులు

నవతెలంగాణ-మోపాల్



అర్ధరాత్రి వేళ అరెస్టు చేస్తున్న పోలీసులు

కాళేశ్వరంలో భాగంగా ప్యాకేజీ 21, 22 కింద నిర్మిస్తున్న మంచిప్ప రిజర్వాయర్ పనులు ఆపాలని భూ నిర్వాసితులు శుక్రవారం ఆందోళన చేపట్టగా.. పలువురు రైతు నాయకులను పోలీసులు అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. కాగా శనివారం ఉదయం కోర్టుకు తరలించి రిమాండ్‌కు తరలించారు. అయితే భూ నిర్వాసిత కమిటీ గౌరవ అద్యక్షులు దేవా శంకర్‌తో పాటు గంగాధర్ యాదవ్‌ను మాత్రమే అరెస్ట్ చేసినట్టు పోలీసులు చెబుతుండగా.. 12 మందినీ అరెస్ట్ చేశారని ముంపు బాధితులు ఆరోపిస్తున్నారు.

వివరాలు మెయిన్‌లో..

చోరీ కేసు.. 24 గంటల్లో ఛేదన

నవతెలంగాణ-రామారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ అనిల్

ఓ చోరీ కేసును రామారెడ్డి పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పోసానిపేట్ ఎల్లమ్మ దేవాలయంలో గురువారం రాత్రి తాళం పగలగొట్టి అమ్మవారి 3 గ్రాముల బంగారు పుస్తెలు, బంగారు బొట్టు బిల్లలు, వెండి మట్టెలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించగా ఎస్సై అనిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం పోసానిపేట శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, అనుమానస్పదంగా ఓ వ్యక్తి కనిపించి పరిగెడుతుండగా, పోలీసులు పట్టుకొని తమదైన శైలీలో విచారించారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ కు చెందిన ఇస్లావత్ శ్రీనివాస్ కూలిగా పని చేస్తూ, ఎల్లమ్మ దేవాలయంలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని, దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని, నిందితున్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పి. సిద్ధిరాములు, లక్ష్మీకాంత్ తదితరులు ఉన్నారు.

రూ.3 కోట్లతో బస్టాండ్ నిర్మాణం



బస్టాండ్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

- త్వరలో పనులు ప్రారంభించి.. ఐదు నెలల్లో పూర్తిచేస్తాం : ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌ను రూ.3 కోట్లతో నిర్మించనున్నట్టు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిని ప్రతి పక్షాలు అడ్డుకుంటున్నాయని అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ ప్రజల కోరిక నెరవేరబోతుందని, దాదాపు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు ఉన్నందున మున్సిపల్ నిధులనుండి రూ.3 కోట్లతో ఎల్లారెడ్డి బస్టాండ్ నూతన నిర్మాణం పనులు 5 నెలలోపు పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బస్టాండ్ ప్రారంభిస్తామని అలాగే ఎల్లారెడ్డిలో వంద పడకల ఆసుపత్రి, ఇతర అభివృద్ధి పనుల కోసం ఆర్థిక శాఖ మంత్రి, వైద్య శాఖ మంత్రి హరీష్ రావు ఎల్లారెడ్డికి వస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే రూ.15 కోట్లతో ఎల్లారెడ్డి ఆసుపత్రి వంద పడకల పనులు ప్రారంభమవు తాయని, ఇంటిగ్రేట్ మార్కెట్ కూడా రూ.2కోట్లతో పనులు ప్రారంభం అయ్యాయని అదేవిధంగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ ప్రతిపక్షాలు కావాలని స్థానిక ప్రజలను రెచ్చగొడుతున్నాయని అన్నారు. ప్రతి పక్షాల మాటలు ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. 4 సంవత్సరాల్లో నియోజకవర్గం ఎలా అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసని తెలిపారు. బస్టాండ్ నిర్మాణానికి ఎల్లారెడ్డి పట్టణ ప్రజలు వ్యాపారులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్య నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రరం నారాయణ, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వినీత్,పట్టణ బిఆర్ ఎస్ అధ్యక్షుడు సతీష్, ఎల్లారెడ్డి బిఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకల సాయిలు, ఎల్లారెడ్డి మండల బిఆర్ఎస్ అధికార ప్రతి నిధి శంకర్, వెలుట్ల సాయిలు, మాటర్ సర్పంచ్ కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు,షరీఫ్, లింగం,ఆఫీఫ్, రాస్, నెల్లి గోపాల్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మద్దికుంట ఆలయంలో పూజలు



కోనేరులో స్నానాలాచరిస్తున్న సందర్శకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట శ్రీ స్వయంభూ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మాఘమా అమావాస్యను పురస్కరించుకొని శనివారం సందర్శకులు, భక్తులు మాఘమా స్నానాన్ని ఆచరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆనవాయితీగా వనభోజనాలను చేశారు. సందర్శకులు ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్శకుల, భక్తుల సందర్శన కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేసింది. నిరంతరం పారుతున్న జలబుగ్గ సందర్శకులను కనువిందు చేసింది. ఆర్టీసీ అధికారులు ఆలయం వరకు ప్రత్యేక బస్సులను నడిపారు. కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట్, మెదక్ తోపాటు హైదరాబాదు నుండి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో తడిపొడి విధానంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-గాంధారి

వరి పంటలో తడిపొడి విధానం అవలంభిస్తే పంటలకు చీడపీడల బెడద తగ్గి అధిక దిగుబడి వస్తుందని పద్మపాని స్వచ్ఛంద సంస్థ మండల సమన్వయ కర్త పట్వొల్ల కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని గుర్జల్ గ్రామంలో శనివారం పలువురి రైతులకు అవగాహన కల్పించారు. తడిపొడి విధానం అవలభించడం వల్ల వరిపంటలో దోమ పోటు, తగ్గడం, అధిక పిలుకలు, దిగుబడి పెరగడం వాంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంత బాయి లక్పతిరావు, ఏఈఓ రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ లేక పరేషాన్

- భయాందోళనలో విద్యార్థులు
- ప్రతేడాదీ ప్రతిపాదనలు పంపిస్తున్నా పట్టని ఉన్నతాధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి



ప్రహరీ లేక.. తరగతి గది కిటీకిలోకి వెళ్తున్న చెట్టు కొమ్మలు

మండలంలోని పలు స్కూళ్లకు ప్రహరీ లేక.. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. దీంతో పాటు చెట్లు ఏపుగా పెరిగి కిటికీల్లోకి కొమ్మలు వస్తుండటంతో క్రిమికీటకాలు తరగతి గదుల్లోకి వస్తున్నాయని వాపోతున్నారు. కాగా ప్రతేడాదీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నా.. పట్టనట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. తాడ్వాయి మండలంలో 32 పాఠశాలలున్నాయి. కాగా నందివాడ గ్రామంలోని సెకండరీ పాఠశాలతో పాటు పల్లె గడ్డ తండా, సోమారం తండా, పిరుమయా కుంట తండాలో పాఠశాలలకు ప్రహరీలు లేవు. చిట్యాల పాఠశాలలో ప్రహరీ వెనుక భాగంలో కూలిపోయి ఎన్నో సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రహరీలు లేక స్కూలు ఆవరణ లోకి పందులు, కుక్కలు వస్తున్నాయని, పాములు సంచరించే ప్రమాదం లేకపోలేదు. స్కూల్ పక్కనే ప్రహరీ గోడ కూలిపోవడంతో గోడల మధ్యలో చెట్లు పెరగడంతో కిటికీలకు ఆనుకొని చెట్లు ఏపుగా పెరిగాయి. దాంతో వర్షాకాలంలో పాఠశాల గదుల్లోకి పాములు తేళ్లు వచ్చే ప్రమాదం ఉందని ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారులు ప్రమాదంలో జరిగిన తర్వాత చర్యలు తీసుకోకుండా ముందుగానే మేల్కొని వెంటనే ప్రహరీలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఎంఈవో రామస్వామి. తాడ్వాయి



నాలుగు స్కూళ్లకు సంబంధించి ప్రహరీల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించాము. మన ఊరు మనబడిలో భాగంగా పల్లె గడ్డ తండా పాఠశాల ఎంపికైంది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. మిగతా పాఠశాలల కోసం మళ్లీ ప్రతిపాదనలు పంపించాము. కానీ ఇంకా అప్రూవల్ రాలేదు. రాగానే వాటికి సైతం నిర్మిస్తాం.

ఉపాధ్యాయురాలి ప్రతిభ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్‌కు చెందిన ఉపాధ్యాయురాలు సంధ్యారాణి జిల్లా కేంద్రంలోని జరిగిన టీఎల్ఎం మేళాలో కిడ్నీల పనితీరుపై రూపొందించిన ప్రయోగాత్మక పరికరం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్‌రావు, జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ తదితరుల ద్వారా ప్రశంసాపత్రం పొందారు. కాగా మోర్తాడ్ మండల కేంద్రంలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణి చేసిన ప్రయోగంపై ఉపాధ్యాయ బృందం సైతం అభినందించింది.

పౌరసరఫరాల మేనేజర్‌ను కలిసిన జిల్లా డీలర్లు



నవతెలంగాణ-వర్ని

నిజామాబాద్ జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన జగదీష్ కుమార్‌ను నిజామాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అతిమల నాగేష్, కార్యదర్శి పార్థసారథి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై నిజామాబాద్‌కు వచ్చిన ఆయనకు రేషన్ డీలర్లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రేషన్ డీలర్లు తదితరులున్నారు.

ఆడపిల్లను బతకనిద్దాం.. చదవనిద్దాం

పలుచోట్ల 'భేటి బచావో భేటి పడావో'

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆడపిల్లను బతకనిద్దాం.. చదవనిద్దామని పలువురు అన్నారు. శనివారం భేటి బచావో భేటి పడావోలో భాగంగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

సిరికొండ : మండలంలోని కొండాపూర్ గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో భేటి బచావో భేటి పడావో కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముందుగా సూపర్‌వైజర్ ప్రియదర్శని మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ,పురుషులు ఇరువురు సమానమని, స్త్రీ, పురుషుల మధ్య ఎలాంటి వివక్షత ఉండకూడదని, పురుషుని కంటే స్త్రీ ఏ విషయంలో తీసిపోదని అన్నారు. నేటి సమాజంలో స్త్రీలు అన్ని రంగాలలో ముందున్నారని, అయినప్పటికీ సమాజంలో ఆడపిల్లల పట్ల చిన్నచూపు ఎక్కువగా ఉందని అన్నారు. నేటి సమాజంలో స్త్రీల నిష్పత్తి తగ్గుదలకు ప్రధాన కారణాలు స్త్రీ భ్రూణహత్యలు పుట్టబోయే బిడ్డ ఆడ లేక మగ అని అనేకం జరుగుతున్నాయని, అందు కోసం ఆడబిడ్డను పుట్టనిద్దాం ఆడబిడ్డను చదవనిద్దాం అని నినాదంతో కేంద్రం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి ఒక్కరూ స్త్రీలను గౌరవించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు కవిత పాల్గొన్నారు.



సిరికొండ : కొండాపూర్‌లో ప్రతిజ్ఞ

కస్తూర్బాలో బేటీ బచావో.. బేటి పడావో..

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో భీంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటిబచావో.. బేటిపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సరస్వతి విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన తీవ్ర ఆరోగ్య ప్రమాదాలు, బాల్యంలో గర్భం వలన మరణం లేక వైకల్యాలకు కారణం అవుతుందన్నారు. అమ్మాయిల విద్యా, సాంఘిక, ఆర్థిక అభివృద్ధి ఆగిపోయేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ విషయంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. బాలల హక్కులు, వాటిని సద్వినియోగం చేసుకునే విధానంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ చిత్రాలను గీసి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిని గంగామణి, స్థానిక అంగన్వాడీ టీచర్లు యమునా, గంగాజమున, బాలమణి, దివ్య, కస్తూర్బా గాంధీ విద్యాలయం టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో..

జాతీయ బాలికల దినోత్సవం..

ఏర్గట్ల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో ముందుడాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు బాలికలకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్.ఎం మునీరోద్దీన్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఏర్గట్ల : బహుమతులతో విద్యార్థులు

నాపై వచ్చిన ఆరోపణలు నిరాధారం

- కార్పొరేటర్ హరొన్‌ఖాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నాపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని నగరంలోని 13వ డివిజన్ కార్పొరేటర్ హరొన్ ఖాన్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా నాపై అనవసర ఆరోపణలు చేస్తూ ఎంఐఎం పార్టీ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. తాను ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదని, కావాలనే తప్పుడు ఆరోపణ చేస్తున్నారని వెల్లడించారు. ఈ విషయమై విచారణ చేపట్టాలన్నారు. సాక్ష్యాధారాలు ఉంటే దేనికైనా సిద్ధమని తెలిపారు.

ముగిసిన సీనియర్ జిల్లా సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని గత వారం రోజులుగా సాంఘిక సంక్షేమ పాఠశాల క్రీడా మైదానంలో సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి విచ్చేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 23 వరకు అంబేద్కర్ స్టేడియం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరుగుతున్న సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు క్రమశిక్షణతో పాల్గొని సమిష్టిగా ఆడి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలన్నారు.

ఏఈఓకు ఎంపీపీ అభినందనలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గాంధీనగర్ తండా రైతు వేదిక భవనం ప్రాంగణంలో మొక్కలకు ఏఈఓ రమాకాంత్ నీరు పోశారు. తన విధులను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం మొక్కలను పెంచడం పట్ల ఏఈఓకు ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్ అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-సిరికొండ

జనవరి 22,23న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగే 9వ తెలంగాణ సీనియర్ బాలుర రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మెన్ రావుట్ల నర్సయ్య శనివారం తెలిపారు. గత మాసంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో పాల్గొని, అత్యంత ప్రతిభ కనబరిచిన యస్.తనుజ్, యస్.సిద్ధార్థ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం జరిగిందని, ఎంపికైన విద్యార్థులను నేడు పాఠశాలలో అభినందించి రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, సంతోష్, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్/కంఠేశ్వర్

మండలంలో పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. గత వారం రోజుల క్రితం ఎంపీపీ భర్త సామ వెంకట్‌రెడ్డిపై వేంపల్లి సొసైటీ మాజీ చైర్మన్, అతని సోదరుడు, కుమారుడు కలిసి గాంధీ చౌక్ వద్ద దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దాడికి సంబంధించిన ఘటన వివరాలపై ఆరాతీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అదేవిధంగా మండలంలోని నాగంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బద్దం గణేష్‌ను సైతం పరామర్శించారు. బాల్కొండ విలేకరి మల్లేష్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు తదితరులున్నారు.



ముప్కాల్ : వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి

పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి..

కంఠేశ్వర్ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు కార్యాలయంలో గల నూతనంగా ఏర్పాట్లు చేస్తున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్లో అధునాతన టెక్నాలజీని ఉపయోగించి సీసీ టీవీ కెమెరాల అనుసంధానంతో ఎలాంటి అవాంఛనీయ ఘటలను జరగకుండా (పసికట్టేందుకు) ఏర్పాట్లు చేస్తున్న పోలీస్ కమిషనర్ కె.ఆర్.నాగరాజును అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.అరవింద్‌బాబు, నిజామాబాద్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జి.మధుసుదన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ నూతన డిజైన్ నిలిపివేయండి

- ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మంచిప్ప ప్రాజెక్ట్ నూతన డిజైన్‌ను నిలిపివేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్యాకేజీ 21, 22 కొండం చెరువు మంచిప్ప, ప్రాజెక్ట్ నూతన డిజైన్ నిలిపివేయాలని జరిగే ఉద్యమాన్ని పోలీస్ నిర్బంధం ద్వారా అడ్డుకోలేరని అన్నారు. శనివారం సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యాలయంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రాణహిత చేవెళ్ల 21, 22 ప్యాకేజీ పనులకు అనుమ తులు వచ్చాయని ఆ ప్రాజెక్టు ద్వారా సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పంట సాగు ఉపయోగ పడుతుందని ఆనాడు ప్రకటించారని తెలిపారు. 1.5 టీఎంసీ నీళ్లతో కేవలం 150 ఎకరాల నష్టంతో ఏ ఒక్క గ్రామము మునిగిపోకుండా బినోల నుంచి పనులను ప్రారంభించి అతి వేగంగా, 16 కిలోమీటర్లు సొరంగం మార్గం ద్వారా సారంగపూర్ వరకు పనులు పూర్తి చేశారని తెలిపారు. నూత నంగా అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం పాత డిజైన్ మార్చి సొరంగ మార్గాలన్నింటిని రద్దుచేసి నూతనంగా పైప్‌లైన్లతో డిజైన్ ఏర్పాటు చేసి 3.5 టీఎంసీలు నిలువ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టి, ఏ ఒక ఎకరమైన అధికంగా సాగవుతుందో నేటికీ అధికారులు ప్రకటించకపో వడం శోచనీయమని అన్నారు. 2015 నుంచి మూడు గ్రామపంచాయతీలు తొమ్మిది గిరిజన తండాలు సుమారుగా 10, 12 వేల మంది ప్రజలు వ్యతిరేకిస్తూ స్పష్టమైన డిజైన్ ప్రకటించండి అని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. నూతనంగా తయారుచేసిన డిజైన్ అయోమయంగా ఉందని, దానిద్వారా ఒక మహిళ ఆకస్మిక గుండెపోటుతో మరణించిందని అధికారులకు తెలియజేసినా ఎటువంటి స్పందన లేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పనుల్ని తాత్కాలికంగా పక్కన పెడుతు న్నామని చెబుతూనే పంప్‌హౌస్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్ని భయాందోళన చేయడం ఏ మేరకు సమంజ సమని అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్మాణం చట్టబద్ధతతో జరగట్లేదని, భూసేకరణ సర్వే ఇంతవరకు పూర్తి కాలేదని, మరోవైపు అనుమతులు పొందామని అధికారులు చెప్పడంలో అస్పష్టత ఉందని గుర్తు చేశారు. పంప్ హౌస్ పనులు నిలిపివేయాలని ఈనెల 20న నష్టాన్ని గురవుతున్న తొమ్మిది గిరిజన తండాలు, మంచిప్ప గ్రామపంచాయతీ ప్రజానీకం నిరసన వ్యక్తం చేయడానికి బయలు దేరితే ఆ కమిటీకి బాధ్యులైన శ్రీనివాస్ యాదవ్, శంకర్, ఈశ్వర్‌ను అరెస్ట్ చేయడమే కాకుండా, ఆ ప్రాంతమంతా పోలీస్ మయం చేయడం ప్రజాస్వామిక విధానానికి విరుద్ధమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు వచ్చి గ్రామ సభలు నిర్వహించి స్పష్టమైన విధానాన్ని ప్రకటించి పాత డిజైన్ ద్వారానే పనులు సాగించుకోవాలని, నాయ కులందరిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షులు సాయగౌడ్, భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యు.రాజన్న, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు దండు గంగమల్లు, ఈ.రమేష్, ఆకుల గంగారాం, అఖిలభారత ప్రగతిశీల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.ప్రభాకర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురానికి అవార్డుల పంట

నవతెలంగాణ-ఆర్మూర్

రీజినల్ మీట్ కార్యక్రమంలో రీజినల్ చైర్‌పర్సన్ లయన్ పిడుగు గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవార్డ్ ఫంక్షన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం క్లబ్‌కు 14 అవార్డులు వచ్చాయి. ఎక్సలెంట్ విజన్ యాక్టివిటీస్, బెస్ట్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ ప్రోగ్రాం, ఎక్సలెంట్ అంగర్ రిలీఫ్, బెస్ట్ సర్వీస్ ఆక్టివిటీస్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం క్లబ్‌కు అవార్డ్స్ వచ్చాయి. ఎక్సలెంట్ ప్రెసిడెంట్‌గా లయన్ చెన్న రవికుమార్‌కు, ఔట్ స్టాండింగ్ సెక్రెటరీగా లయన్ చిన్న రెడ్డి, ఔట్ స్టాండింగ్ ట్రెజరర్‌గా లయన్ ఉదయ్‌కుమార్‌కు అవార్డ్స్ వచ్చాయి. చీఫ్ గెస్ట్ లయన్ డాక్టర్ బాబురావు, ఏరియా కో ఆర్డినేటర్‌చే, రీజినల్ చైర్‌పర్సన్ లయన్ పిడుగు గంగారెడ్డిచే అవార్డ్స్ అందుకున్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ లయన్ శివరాజ్ కుమార్, లయన్ సుధీర్ బాబు, లయన్ ఎం.రాజన్న లయన్ అంబల్ల తిరుపతి, లయన్ హరినారాయణ, లయన్ జీవీ నర్సింహరెడ్డి, లయన్ వెంకట్రామిరెడ్డి, లయన్ జ్ఞాని చావ్లా, లయన్ మోహన్ దాస్, లయన్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులతో క్లబ్ సభ్యులు

రెంజల్ ఎస్ఐకు ప్రశంస

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఫంక్షనల్ వర్టికల్ యందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెంజల్ ఎస్ఐ సాయన్నకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.అరవింద్ బాబు ప్రశంసాపత్రాన్ని శనివారం అందజేసి అభినందించినారు.



హెచ్ఐవి నివారణకు కృషి చేయాలి

- ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ రాష్ట్ర అధికారి నైన్ కుమారి

నవతెలంగాణ-నవీపేట్

గ్రామాల్లో హెచ్ఐవీ నివారణకు లింక్ వర్కర్లు నిర్విరామ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ రాష్ట్ర అధికారిని నైన్ కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో లింక్ వర్కర్స్ పనితీరు, చేస్తున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. లింక్ వర్కర్ వడ్డే రవిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేష్, ప్రోగ్రాం ఫీల్డ్ అధికారి శ్రీనివాస్, లింక్ వర్కర్ స్కీం జిల్లా అధికారి సుధాకర్, జోనల్ సూపర్‌వైజర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం అబద్ధం

- గిట్టనోళ్లు పెట్టిన పొగ : కౌన్సిలర్‌లు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్‌పై తిరుగుబాటు చేశారని, అసమ్మతి సెగతో రగిలిపోతు న్నారని కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలు (నవ తెలంగాణలో కాదు) పచ్చి అబద్ధమని మున్సిపల్ కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఖండించారు. వైస్ చైర్మన్ మున్నుభాయ్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు గంగా మోహన్ చక్రూ, ఆకుల రాము, సుంకరి ఈశ్వరి రంగన్న, మెడిదల సంగీత రవిగౌడ్, పుల్లి బేగం రెహ్మాన్, ఖందేశ్ సంగీత శ్రీనివాస్ తదితరులు శనివారం మూకుమ్మడిగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. అసమ్మతి సెగ అంటూ బీఆర్ఎస్‌ను దెబ్బతీసే విధంగా వచ్చిన కథనాలపై మండిపడ్డారు. ఇది ప్రత్యర్థులు చేసిన కుట్ర అని తెలిపారు. గిట్టనోళ్లు పెట్టిన పొగ అని వివరించారు. ఈ కుట్రలను పట్టించుకోకుండా ముందుకు సాగుతామని తెలిపారు. చైర్మన్‌పై మాకు ఎలాంటి కోపం లేదని, చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నామనడం పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. కొన్ని పత్రికల్లో వచ్చిన అసత్య కథనాలు చాలా దారుణమని, తమ దంతా ఒకే కుటుంబమని వివరించారు. ఆర్మూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.200కోట్లతో ప్రణాళికలు రూపొందిస్తున్నారని, మా వార్డుల్లో సమస్యలు చెప్పడానికే జీవనన్నను కలిశామని వివరించారు. మా వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణం, మిగిలిన అర్హులకు పెన్షన్ల మంజూరు వంటి అనేక సమస్యల గురించి జీవనన్న దృష్టికి తీసుకువచ్చామని, ఎవరెన్ని కుట్రలు చేసినా మా మధ్య చిచ్చుపెట్టలేరని తెలిపారు. కార్యక్ర మంలో అన్ని వార్డుల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రశాంతంగా పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శనివారం ఉదయం జరిగిన యూజీ 2వ సెమిస్టరు (బ్యాక్‌లగ్) పరీక్షలో 200మంది విద్యార్థులకు గాను 187మంది హాజరయ్యారని, 13మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన 5వ సెమిస్టరు (రెగ్యులర్), 6వ సెమిస్టరు బ్యాక్‌లగ్ పరీక్షలలో 3193కి గాను 2975మంది హాజరయ్యారని 218మంది గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు.

ప్రమాద బాధితులకు బియ్యం అందజేత

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని సర్పంచ్ తండాలో కేతావత్ సంధ్యకు చెందిన మూడు కుటుంబాలకు సంబంధించి, మూడు గుడిసెలు కాలిపోవడం వలన వారికి వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ గ్రామీణ ఇంచార్జి పాటుకూరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బియ్యం, ఆర్థికసాయం శనివారం అందజేశారు. అలాగే వీరికి డబుల్ బెడ్ రూమ్‌లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిరికొండ మండలం వైఎస్సార్ టీపీ అధ్యక్షులు జగదీష్, యువనాయకులు అరుణ్, తండావాసులు పాల్గొన్నారు.

రెండు పడక గదులు మంజూరు చేయాలి

- జైతాపూర్ టీఆర్ఎస్ పార్టీ నాయకుల విన్నపం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జైతాపూర్ గ్రామంలో నిరుపేద, పేద, సామాన్య కుటుంబ ప్రజలతోపాటు నివాసం ఉండడానికి ఇల్లు లేని వారు చాలామంది ఉన్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు పడకల గదులను మంజూరు చేయాలని టీఆర్ఎస్ నాయకులు కోరారు. గ్రామస్తులు ఐక్యతతో లబ్దిదారులను గుర్తించి నివేదికను తయారు చేశారు. ఆ నివేదికను బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శ్రీరాంకు శనివారం అందజేశారు. తప్పకుండా ప్రతి ఒక్కరికి రెండు పడకల గదులు మంజూరు అయ్యేందుకు బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ దృష్టికి తీసుకువెళ్తానని శ్రీరామ్ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జైతాపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు కరటూరి సత్యనారాయణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కిష్టపురం రవి, నుడా డైరెక్టర్ మధుగౌడ్, మాజీ అధ్యక్షులు కంటి సత్యనారాయణ, గణేష్, రామ్‌గోపాల్‌రెడ్డి గ్రామ పెద్దలు ఉన్నారు.

ఘనంగా త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరి జాతర మహోత్సవం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పెద్దవాల్గోట్, సర్పల్లి తాండా గ్రామపంచాయతీల పరిధిలోని త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరి బోడగుట్ట జాతర మహోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. కొండపైన ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇందులో రెండు గ్రామాల ప్రజలు ముందు వెనక రథానికి కట్టిన తాడును లాగారు. కార్యక్రమంలో ఇరు గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి

- పూజలు చేసిన హైకోర్టు జడ్జి నరేందర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుప్రియ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమావాస్య పర్వదినం పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో దూర ప్రాంతాల నుంచి శనివారం తరలివచ్చారు. భక్తుల సౌకర్యం మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం, అలాగే కోనేరు వద్ద భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఎడపల్లి, రెంజల్ పోలీస్ అధికారులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. హైకోర్టు జడ్జి నరేందర్‌తో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుప్రియ, ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతతో పాటు అష్టముఖి కోనేరు పవిత్రతను హైకోర్టు జడ్జి నరేందర్ అధికారులను, ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కార్యనిర్వాహణాధికారి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు, ధర్మకర్త మండలి ప్రతినిధులు, జానకంపేట సర్పంచ్ సాయిలు, ఎంపీటీసీ మంద సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాన్కంపేట్ ఆలయం వద్ద ప్రజలు

ఘనంగా చిలుకల చిన్నమ్మ జాతర

నవతెలంగాణ-ఆర్మూర్

బాల్కొండ మండలంలోని శ్రీరాంపూర్ గ్రామంలో చిలుకల చిన్నమ్మ జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ, సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్మూర్, పెర్కిట్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను తక్షణమే పెంచాలని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ బోధన్ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డివిజన్ నాయకులు రాజన్న మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సతీష్, శీను, మహేష్, గంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగమంలో భక్తుల తాకిడి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం శనివారం భక్తులతో కిటకిటలాడింది. మాగ అమావాస్య పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తుల అత్యధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.

సీతారాం త్యాగి ఆశ్రమంలో అన్నదానం..

మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద గల సీతారాం త్యాగి ఆశ్రమంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాఘ అమావాస్యలో పురస్కరించుకొని అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో వారి సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సేవా కార్యక్రమంలో గోవింద్, మోహన్, బైరి బత్రి రమేష్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వం ఏసిడి పేరుతో ప్రజలపై కరెంటు బిల్లుల భారం మోపుతోందని, వెంటనే ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా కరెంటు చార్జీలను వడ్డిస్తున్న ప్రభుత్వం, సామాన్య ప్రజలను నడ్డి విరుస్తుందని దుయ్యబట్టారు. ప్రజలకు తెలియకుండానే, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఏసిడి పేరుతో కొత్త రకం వసూళ్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టి.. ప్రజలకు సంక్రాంతి పండుగ నాడు షాక్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఏసీడీ చార్జీలతో సామాన్య ప్రజలపై పెనుభారం పడుతోందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని ప్రకటనలో పేర్కొన్నారు.

అంధత్వ నిర్మూలనకే.. కంటివెలుగు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ

రాష్ట్రం లో సంపూర్ణ అంధత్వ నిర్మూలన కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించినట్లు, దేశం లోనే ఆదర్శవంతమైన పథకమని ఎంపీపీ ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దకొడప్ గల్ మండలం చిన్నదేవ్ సింగ్ తండా గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పౌరులందరికీ కంటి పరీక్షలు, ఉచితంగా అద్దాలు, మెడిసిన్స్ అందజేస్తారని, తీవ్రమైన వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 25 శాతం మంది ప్రజలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ లలిత వీరునాయక్, ఎమ్మార్వో దశరథ్, ఎంపీడీవో రాణి,ఎంపీవో సూర్యకాంత్, సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, వైద్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-తాడ్వాయి

అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తాడ్వాయి మండలం చందాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి స్వామి (41) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుఆన్నడు. అనారోగ్య సమస్యలు భరించలేక గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. గమనించిన కుటుంబీకులు, స్థానికులు హుటాహుటిన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి వెంటనే హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి అనారోగ్యంతో పాటు అప్పులు సైతం ఉన్నట్లు వారు వివరించారు. మృతుడికి భార్య ప్రమీల, కుమారుడు శ్రావణ్, కుమార్తె జోష్ణ ఉన్నారు.

బడుగుబలహీన వర్గాలకు అండ


పలువురికి సభ్యత్వ నమోదు కార్డులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రెండవ రోజు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అండగా కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి బాలరాజు, మండల కార్యదర్శి ఎల్ శ్యామల, నాయకులు కాసిం, మనమ్మ, పోచవ్వ, లక్ష్మీనారాయణ, రాములు, గ్రామ శాఖ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు తనిఖీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో

పెద్దకొడప్ గల్ మండలంలోని సమందర్ తండా గ్రామపంచాయతీ రికార్డులను డిఎల్పిఓ శ్రీనివాస్ తనిఖీ తనిఖీ చేశారు. గ్రామానికి శనివారం సందర్శించి గ్రామంలోని పల్లెప్రగతి పనులను, వివిధ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి గ్రామస్తులను ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామంలో క్రీడా ప్రాంగణాల పనులు త్వరగా పూర్తిచేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా సక్రమంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో కరెంటు సమస్య ఏర్పడడంతో తక్షణమే కరెంటుశాఖ ఏఈతో ఫోన్‌లో సంప్రదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ స్రవంతి భాయ్ బాబు సింగ్, ఎంపీఓ సురేకాంత్, పంచాయతీ కార్యదర్శి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత చౌలమద్ది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


ట్రోఫీ అందుకుంటున్న టీం

మండల కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ చిలుక కిష్టయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా జగిత్యాల జిల్లా చౌలమద్ది జట్టు నిలిచింది. శనివారం సాయంత్రం టోర్నమెంటు ముగింపు వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. గత 20 రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్లో ఫైనల్ మ్యాచ్ చౌలమద్ది, మోర్తాడ్ జట్లు తలపడ్డాయి. చౌలమాద్ది విజేతగా నిలువగా జట్టుకు 20వేల పారితోషికం, ట్రోఫీ బహుమతిగా అందజేశారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన మోర్తాడ్ జట్టుకు ట్రోపీ, పదివేల నగదును బహుమతిగా అందించారు. కార్యక్రమంలో చిలక కిష్టయ్య కుమారులు ప్రశాంత్, ప్రమోద్, విద్యావేత్త దేవేందర్, చింత శ్రీకుమార్, పాషా, బుచ్చన్న, వినోద్‌గౌడ్, నరేష్, టీపీఎస్ దారి, గ్రీన్‌ఫీల్డ్ క్రికెట్ క్లబ్ కమ్మర్‌పల్లి (జీసిసి) సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతతోనే దేశ ప్రగతి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ
- అన్ని రంగాలలో మహిళలు ఉన్నతి సాధించాలి
- ఉభయ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు సునీత, శ్రీదేవి.
- ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే.. అద్భుత విజయాలు : కలెక్టర్



సదస్సులో ప్రసంగిస్తున్న హైకోర్టు జడ్జి శ్రీసుద


మాట్లాడుతున్న కలెక్టర్


హాజరైన యువతులు, మహిళలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

స్త్రీ, పురుష సమానత్వ సాధనే అందరి ఆశయం కావాలని, రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కును సాధించుకుని దేశ ప్రగతి నిర్మాణానికి సారథులు కావాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ పిలుపునిచ్చారు. న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం పెరగడం మహిళల సాధికారతలో మరో మైలురాయిగా స్థిరపడుతుందని తెలిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టులలో మహిళ న్యాయమూర్తుల సంఖ్య పెరుగుదల జెండర్ వివక్షకు విరుగుడుగా అభివర్ణించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీస్ పేరెడ్ గ్రౌండ్లో నిర్వహించిన మహిళ సాధికారత సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రధానోపన్యాసం చేశారు.

వివిధ రంగాలలో మహిళలు సాధించిన విజయాలు ప్రేరణగా తీసుకుని ప్రస్తుత విద్యా, ఆర్థిక, సామాజిక, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆమె ఉద్బోధించారు. భారత యువత దేశానికి ఉన్న అతిపెద్ద మానవ వనరులు అని, అభివృద్ధికాముక దేశానికి ఇంకేమి కావాలని అన్నారు. కలలు కనడమే కాదు వాటిని సద్వినియోగం చేసుకోవడానికి సంకల్పబలం కలిగి వుండాలని పేర్కొన్నారు. మహిళలు శక్తిమంతులని నేడు ఎన్నో రంగాలలో ఉన్నతస్థాయికి చేరుకుని తమ ప్రతిభాపాటవాలు సమాజానికి తెలియజేస్తున్నారని తెలిపారు. ప్రజా సమూహాల నుండి కలిగిన ప్రయోజనాలను తిరిగి వారికి చేరవేయడంలో ముందుండాలని కోరారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, మంచి అలవాట్లు మంచి నడవడికను నేర్పుతాయని, సమయాన్ని వృథా చేయరాదని సమయ తిరిగిరాదని సమయానుకూల నిర్ణయాలే వ్యవస్థలో నిర్ణయాత్మక వృత్తి నిపుణులను తయారు చేస్తాయని జస్టిస్ శ్రీసుధ పలువురు ప్రముఖ వ్యక్తుల, రాజ్యాల అధినేతల నేపథ్యాలను ఉదహరించారు. చట్ట పరమైన హక్కులను కోరతారు కాని బాధ్యతలను మరుస్తారని అమె అవేదన వ్యక్తం చేశారు. యువత జీవితాలలో అన్ని విజయాలు సమకూరాలని ఆకాంక్షించారు.

నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ప్రసంగిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఎలాంటివి ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనలో యువత విద్యకు తగిన ఉద్యోగాన్ని బేరీజు వేసుకోవాలని సూచించారు. క్రమబద్ధమైన ప్రణాళికలు, కష్టపడేతత్వం, నిరంతర అధ్యయనం మంచి భవిష్యత్తుకు పునాదులుగా నిలుస్తాయని వివరించారు.

కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్. శ్రీదేవి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్ పెంపొందించుకోవాలని, సంతృప్తికరమైన వృత్తి జీవనంలో స్థిరపడాలని అన్నారు. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అందుకు శ్రమైక జీవనవిధానాన్ని అలవర్చుకోవాలని అన్నారు.

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రసంగిస్తు రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన ఉద్యోగాల నోటిఫికేషన్లను వడిసిబట్టుకుని విజయులు కావాలని సదస్సుకు హాజరైన విద్యార్థినులకు ఉద్బోధించారు. ఉద్యోగాలకోసం కసిగా కష్టపడాలని, రాజీ పడరాదని, ఆత్మ విశ్వాసమే ఆయుధంగా పయనించాలని లక్ష్యం చేరేవరకు విశ్రమించరాదని తెలిపారు. వేదిక మీద ఉన్న మహిళలనే స్ఫూర్తిగా తీసుకోవాలని, స్త్రీలు వృత్తి నిపుణులు అని కొనియాడారు. సెల్ ఫోన్ అష్టదరిద్రమని సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని పరిమిత స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు జిల్లా అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని అందులో భాగస్వామ్యం కావడం అదృష్టంగానే భావిస్తు న్నామని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ ప్రసంగిస్తూ మెడికల్ ఫీల్డ్ అనేది పుట్టుక నుండి చనిపోయే వరకు అవసమయ్యే విలువైన వృత్తిగా అభివర్ణించారు. కోవిడ్ కష్ట కాలంలో జిల్లా ఆసుపత్రిలోని వైద్యులు చేసిన వైద్య సేవలు తెలుగు రాష్ట్ర లలో ప్రథమంగా నిలిచాయని ఏ వృత్తిని ఎన్నుకున్న ఆ వృత్తిలో ప్రావీణ్యత అలవర్చుకోవాలని పేర్కొన్నారు.

ఆర్.టి.సి రీజినల్ మేనేజర్ ఉషారాణి,విద్యుత్ శాఖ అధికారిణి సుమిత మాట్లాడుతూ ఆయారంగాలలో ఉన్న అవకాశాలను అందుకోవాలని అన్నారు. సదస్సులోఅదనపు జిల్లా జడ్జిలు షౌకథ్ జహన్ సిద్ధికి, శ్రీనివాసరావు, పంచాక్షరీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు భవ్య , సౌందర్య గిరిజ, అదనపు పోలీస్ కమిషనర్ అరవింద్ బాబు, అదనపు జిల్లా కలెక్టర్‌లు చంద్రశేఖర్, చిత్ర మిశ్రా, నెహ్రూ యువ కేంద్రం శైలి, నిశత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న, గ్రంధాలయ కార్యదర్శి లక్ష్మి రాజ్యం, ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ మమత ,బార్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ భీమేశ్వర స్వామి ఉత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


దర్శనం కోసం బారులు తీరిన సందర్శకులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం సంతాయిపేట్ శ్రీ భీమేశ్వర స్వామి ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాఘ అమావాస్య సందర్భంగా ప్రతి సంవత్సరం భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం పక్కనుంచి భీమేశ్వర వాగు ఆలయాన్ని ఆనుకొని ప్రవహిస్తుంది. ఈ వాగు ఉత్తరం నుంచి దక్షిణం వైపునకు ప్రవహిస్తుండంతో ప్రసిద్ధికెక్కింది. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున నిర్వహించిన ఉత్సవాలకు భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. వాగులో స్నానం చేసి భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తాడ్వాయి మండలంలోని భక్తులే కాకుండా చుట్టుపక్కల మండలాలు అయిన కామారెడ్డి, లింగంపేట, గాంధారి, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, సదాశివనగర్, భిక్కనూరు, మాచారెడ్డి, మెదక్ మండలాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. సందర్శకుల సౌకర్యార్థం కమిటీ నిర్వాహకులు అన్నదానం నిర్వహిం చారు. మండలంలోని చిట్యాల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో, కృష్ణాజివాడి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

మాఘ అమావాస్య రోజున ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సంతయిపేట భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలయం ఎంతో పవిత్రమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కౌడి రవి, సర్పంచ్ శెట్టిపల్లి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, సదాశివ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేల్మ రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బాపురెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, కిష్టా గౌడ్, రాజిరెడ్డి, కృష్ణమోహన్, రాజు పాల్గొన్నారు

కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ అధికారులు, గౌడ సంఘం నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సైదగౌని వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా క్యాలెండర్‌ను ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్ రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వమే కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని కల్లు దుకాణాలు ఆధునీకరణ చేయడం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. చెట్లు పెంపకానికి భూములు ఇవ్వాలని ప్రతి జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాలు ఏర్పాటు చేసుకునే విధంగా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలుగీత కార్మిక సంఘం నాయకులు సాయ గౌడ్, నారా గౌడ్, శంకర్ గౌడ్, రాజేష్ గౌడ్, రాజు గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పురుషోత్తం, డిటిహెచ్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కు టీవీ వితరణ


స్కూల్‌కు స్మార్ట్ టీవీ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గోకుల్‌తండా మండల పరిషత్ పాఠశాలకు శనివారం వెంకటలక్ష్మి, భాస్కర్ రూ, 45 వేల విలువగల స్మార్ట్ టీవీని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాలోతు లలిత లింబాద్రి నాయక్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి కోసం పాఠశాలకు టీవీని అందజేసినందుకు గ్రామం, పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి, దాతలకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రాజులు, నోడల్ ఆఫీసర్ గోవర్ధన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సక్కుబాయి, ఉప సర్పంచ్ తిరుపతి నాయక్, ఉపాధ్యాయులు యాదయ్య, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

చెత్తను.. చెత్తబండిలోనే వేయండి

- పట్టణ వాసులకు మున్సిపల్ చైర్మన్ సూచన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


కార్మికుల అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పట్టణంలోని కొందరు వ్యాపారులు రోడ్డుపైనే చెత్త వేస్తున్నారని మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు అందులో చెత్త వేయాలని పదేపదే చెప్తున్నప్పటికీ వారు వినిపించుకోవడంలేదని పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు వ్యాపారులు సహకరించాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ కోరారు. శనివారం తెల్లవారుజామున పర్యటించారు. కార్మికుల పనితీరు, వారి హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం కార్మికులతో మాట్లాడుతూ మున్సి పాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పరిశుభ్రతకు చర్య లు తీసుకోవాలని అలాగే ప్రజలతో మమేకమై వెలగాలని కార్మికులను కోరారు. ప్రస్తుతం పట్టణంలో గాంధీ చౌక్ ఏరియాలో కూరగాయలు విక్రయిస్తున్నారని మార్కెట్‌ను యధావిధిగా పాత చోటికి తరలిస్తామని కూరగాయ వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఆలయాల్లో పూజలు

- మాఘమా అమావాస్య పురస్కరించుకొని బోనాలు, జాతరలు

నవతెలంగాణ-సదాశివనగర్/భిక్కనూర్


భిక్కనూర్ మండలం జంగంపల్లిలో బోనాలు

సదాశివనగర్ మండలంలోని దగ్గి గుట్టపై వెలసిన ప్రభు స్వామి ఆలయ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాఘమా అమావాస్య సందర్భంగా భక్తులు వివిధ గ్రామాల నుండి వచ్చి గుట్ట కింది గల గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారికి మొక్కులు చెల్లించు కున్నారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేశారు.

గంగమ్మకు బోనాలు

భిక్కనూర్ : మండలంలోని జంగంపల్లి గ్రామంలో మాఘమాస సందర్భంగా శనివారం గ్రామంలో ఉన్న గంగమ్మ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా జాతర కార్యక్రమాన్ని గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మకు గంగపుత్ర మహిళలు పెద్ద ఎత్తున డబ్బు చప్పుల మధ్య బోనాలను గ్రామం నుండి ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మ వారికి సమర్పించారు. కార్యక్రమంలో గంగపుత్ర సభ్యులు,భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా దేవేంద్రుని గుట్ట జాతర

భిక్కనూర్ మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామ శివారులో ఉన్న అతి ప్రాచీన ఆలయం దేవేంద్ర స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేంద్రుని గుట్టకు తెల్లవారుజాము నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామం నుండే కాకుండా వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో దేవేంద్రుని గుట్ట ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. దేవేంద్ర స్వామిని దర్శించుకున్న వారిలో సొసైటీ చైర్మన్ బాలగోని రాజగౌడ్, ఎంపీటీసీ మంజుల రాములు, మల్లు పల్లి మాజీ ఉపసర్పంచ్ రామ్‌రెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం గౌడ్, ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్



వ్యక్తి అదృష్టమైన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన పెద్దులు (50) ఈనెల 16వ తేదీ నాడు ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ గౌడ్ తెలిపారు.

ప్రతి మహిళా సంఘం అకౌంట్ 'ఏ' గ్రేడులోకి తీసుకురావాలి

• ఏపీఎం రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రతి మహిళా సంఘం అకౌంట్ ఏ గ్రేడ్‌లోకి తీసుకురావాలని ఏపీఎం రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి చిన్న మహిళ సంఘం ఆర్థిక లావాదేవీలు ఏ గ్రేడులోకి తీసుకురావాలని అన్నారు. ప్రతి మహిళా సంఘానికి మహిళల అభివృద్ధి కొరకు బ్యాంకు రుణాలు ఇచ్చి దోహదపడాలని తెలియజేశారు. అదేవిధంగా శ్రీనిధి రుణాలు, గ్రామ సంఘం రుణాలు, మహిళా సంఘం సభ్యులకు అందజేసి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చూడాలని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంజీ జనార్ధన్, సీసీలు, అకౌంటెంట్, ఆపరేటర్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

'పరీక్ష పేచర్చ'లో ఎంపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ప్రధానమంత్రి మోడీ పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా కాకతీయ హైస్కూల్, బోర్గాం.పి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆర్ట్స్ అండ్ పెయింటింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ ధర్మపురి అరవింద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, ప్రధానమంత్రి మోడీ రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొప్పర్గను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

• ఎమ్మెల్యే షకీల్ ఆమీర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని కొప్పర్గ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. శనివారం కొప్పర్గ గ్రామంలో పల్లె దవాఖాన భవనం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చిందని అందులో భాగంగా కొప్పర్గ గ్రామంలో 20 లక్షలతో పల్లె దవాఖాన భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. పల్లె దవఖాన ద్వారా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి గ్రామస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో కోట్ల రూపాయల నిధులతో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. కొప్పర్గ గ్రామానికి తొలి విడతగా 40 డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేస్తున్నామని, కొప్పర్గ నుంచి నీలా వరకు మిగిలి ఉన్న బీటీ రోడ్డును 15 రోజులలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న మదర్సాకు 5 లక్షల రూపాయలు మంజూరి చేస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. రోడ్డు వెడల్పులో భాగంగా ఇబ్బందులు ఉన్నచోట రోడ్డును సరి చేస్తామని, గ్రామానికి అదనపు గోదాం మంజూరి చేస్తామని తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున అంగన్వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఉపసర్పంచ్ సయ్యద్ ఖలీల్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు, పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దే సావిత్రి, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో మధుకర్, ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య, మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, ఏఎంసి చైర్మన్ విఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ సాలూర షకీల్, డిసిసిబి డైరెక్టర్ శరత్, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఖలీల్ పటేల్, జమీల్ పటేల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బాగుంది

మధ్యాహ్న భోజనం బాగుందని ఎమ్మెల్యే షకీల్ అన్నారు. శనివారం మండలంలోని కొప్పర్గ గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ రహదారి పక్కన గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆకస్మికంగా వెళ్లి విద్యార్థులను పలకరించి మాట్లాడారు. అప్పుడే మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డిస్తుండడంతో అన్నం, కూరలు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రోజు ఇలాగే వండుతారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీపీ బుద్దె సావిత్రి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఉర్దూ మీడియం పాఠశాలను పరిశీలించారు. తెలుగు మీడియం, ఉర్దూ మీడియం పాఠశాలలకు విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు కావాలని ఉపాధ్యాయులు అడగడంతో తక్షణమే మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.



దవఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమావత్ లాల్‌సింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమావత్ లాల్‌సింగ్‌ను టి.వి.యు.వి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.నిజ్జన రమేష్ ముదిరాజ్ ప్రకటించారు.

సంపూర్ణత లేని ప్రమోషన్లు విద్యాశాఖ వైఫల్యమే

• డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న

నవతెలంగాణ-ఆర్మూర్

గత ఏడున్నర సంవత్సరాలుగా ఎదురుచూపుల అనంతరం ఇస్తున్న ప్రమోషన్లు సంపూర్ణతగా ఇవ్వలేకపోవడం విద్యాశాఖ వైఫల్యంగానే భావిస్తున్నామని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులంతా సమానమే అని ప్రజాస్వామిక భావన లేకుండా మేమేదో ప్రత్యేకం అని కొందరు ఉపాధ్యాయులు, సంఘాలు భావిస్తూ ఉండడం వల్లే కోర్టు కేసులను సాకుగా చూపి పర్యవేక్షణ అధికారుల పోస్టులకు, పండిత్ పోస్టులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా ప్రభుత్వం సత్వారం చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తలచిన కార్యాన్ని ఉపాధ్యాయులే నెరవేరుస్తున్నట్టు ఉందని తెలిపారు. ఇప్పటికైనా సయోధ్యతో చర్చలు జరిపి బేశజాలకు వెళ్లకుండా అన్ని పోస్టులకు ప్రమోషన్లు జరిగేలా చూసుకోవాలని అన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదు

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌పై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బోధన్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు రవీందర్ యాదవ్ హెచ్చరించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ అమెర్‌పై ఎవరైనా అసత్య, నిరాదరణ ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే షకీల్‌పై వచ్చిన ఆరోపణలపై జిల్లా పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు రైస్‌మిల్స్‌కు వచ్చి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారని, ఆ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారని తెలిపారు. ఈ విషయంలో సందేహాలుంటే జిల్లా అధికారులను సంప్రదించాలని కాని అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పట్టణ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లవెల్లిలో ఘనంగా పెద్దమ్మ తల్లి పండుగ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి పండుగను గ్రామస్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, సర్పంచ్ నోముల విజయలక్ష్మి లక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ బుసాని అంజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘమాసం వేడుకలు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని లొంక రామలింగేశ్వర ఆలయంలో శనివారం మాఘమాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు కోనేటి స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి శుక్రవారం దేవి జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ శుక్రవారం దేవి జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు మంత్రరాజ్యం మురళి, కృష్ణ పంతులు, ఉత్సవ నిర్వాహకులు పోలీసు విద్యాసాగర్ లావణ్య దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి, ఎంపీడీఓలు కోరారు. శనివారం మండలంలోని కొండాపూర్ గ్రామ పరిధిలోని సర్పంచ్ తాండా గ్రామపంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా స్థానిక సర్పంచ్ సరియా నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వైద్య అధికారి అరవింద్ మాట్లాడుతూ.. ప్రజలు దగ్గర, దూరం చూపు, దృష్టి లోపం కంటి సమస్యలు ఏమున్నా ఈ కంటి వెలుగు శిబిరంలో చెకప్ చేయించుకోవాలని కోరారు. ఎంపీడీఓ లక్ష్మీప్రసాద్, ఎంపీటీసీ బాలీ చందర్, సీహెచ్‌ఓ అనంత రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ టెక్నో పార్క్ ఏర్పాటు చేయాలి

• ఎమ్మెల్యే, ఆర్డీఓకు వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో కుల వృత్తులను అభివృద్ధి చేసుకోవడానికి ప్రభుత్వం విశ్వకర్మ టెక్నోపార్కును ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా విశ్వ బ్రాహ్మణ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వడ్ల సతీష్ చారి ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు, ఆర్డీఓ రాజేశ్వర్‌కు శనివారం వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులకు చెందిన కులవృత్తులను ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చి కొందరు చేపట్టడంతో తమకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం బోధన్ పట్టణంలో విశ్వకర్మ టెక్నో పార్క్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రెండెకరాల స్థలం కేటాయించాలని కోరారు. అలాగే బోధన్ నియోజకవర్గంలో ఉన్న నిరుపేద విశ్వబ్రాహ్మణులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వడ్ల గణేష్ చారి, వడ్ల లాలయ్య చారి, రామకృష్ణ చారి, రమణ చారి, మోహన్ చారి, శంకర్ చారి, వెంకటేష్ చారి, సత్యనారాయణ చారి తదితరులున్నారు.

సౌండ్ సిస్టం వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1985-86కు సంబంధించిన పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు వితరణగా చార్జింగ్ కంసౌండ్ సిస్టంను శనివారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.కవిత, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రఘునాథ్, శ్రీకాంత్, రవీందర్, మనోజ్ కుమార్, కర్తను రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థ గుర్తింపును రద్దు చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నారాయణ విద్యా సంస్థల పేరు మీద అడ్మిషన్ నిర్వహిస్తున్న శ్రీ విజయ సాయి విద్యాసంస్థల యాజమాన్యంపైన క్రిమినల్ కేసు పెట్టాలని, ఆ విద్యా సంస్థ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. (ఏఐఎస్ఎఫ్) నిజామాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో శనివారం బోధన్ పట్టణంలో గల శ్రీ విజయ్ సాయి జూనియర్ కాలేజి, శ్రీ షిర్డీ సాయి మహిళా జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేసి, క్రిమినల్ కేసు పెట్టాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఐఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శివాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. శ్రీ విజయ్‌సాయి, శ్రీ షిరిడీ సాయి మహిళా జూనియర్ కాలేజీలు నారాయణ విద్యాసంస్థల పేరుతో కరపత్రాలు ప్రచురించి ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్ అకాడమిక్ పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఈ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేస్తూ, యజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసు పెట్టాలని అన్నారు. అదేవిధంగా ఎటువంటి పర్మిషన్ లేకుండా నారాయణ పేరు మీద అడ్మిషన్లు నిర్వహిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చూసీచూడనట్టుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే ఆ కళాశాలపైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా కమిటీ సభ్యుడు సుభొద్, నాయకులు వంశి, శిరీష పాల్గొన్నారు.

దక్షిణ భారత రైతు సంఘాల సమావేశంలో పాల్గొన్న కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

కేరళ రాష్ట్రం కన్నూరు జిల్లాలోని చెఱుపూజా పట్టణంలో దక్షిణ భారతదేశ రైతు సంఘాల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కాగా పట్టణానికి చెందిన దక్షిణ భారత దేశ రైతు సంఘాల అధ్యక్షులు కోటపాటి నరసింహంనాయుడు పాల్గొని దీనికి అధ్యక్షత వహించారు.

బాధిత కుటుంబానికి రూ.42వేలు ఆర్థికసాయం

నవతెలంగాణ-నందిపేట్



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ఇటీవల వెల్మల్ గ్రామానికి చెందిన పెద్ద కురుమ ముత్యంకి చెందిన గొర్రెలు, మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో విషయం తెలుసుకున్న జిల్లా నాయకులతో పాటు నియోజకవర్గ నాయకులు ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించి రూ.42 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాన్ని సహాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నాయకులు తొండకూర్ దేవన్న, ముల్లంగి అశోక్, ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు కె.జి.సురేష్, మండల నాయకులు పోతన్న, బోజన్న, తల్వేద ఎంపీటీసీ లింగము, సురేష్, హరీష్, భూమన్న, మహిపాల్, సాయిరెడ్డి, సమేర గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజలపై అధిక విద్యుత్ బిల్లు వసూళ్లా..?

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పేద, మధ్య తరగతి జనాలపై అధిక విద్యుత్ బిల్లును వసూలు చేయడం ప్రభుత్వానికి తగదని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని నగర ఫైవ్‌మాన్ కమిటీ నాయకులు కొయ్యడ నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా నిజామాబాద్ పార్లమెంటు అధ్యక్షులు దేగాం యాదగౌడ్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థ ఏసీడీ చార్జీల పేరుతో బీద, మధ్య తరగతి జనాలపై అధిక విద్యుత్ బిల్లును వసూలు చేయడాన్ని తెలుగుదేశం పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అడిషనల్ చార్జెస్ పేరుతో నెలకు సుమారు 500 కోట్ల వరకు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని సీఎం కేసీఆర్‌పై మండిపడ్డారు. అవసరంలేని ప్రాజెక్టుల పేరున లక్షల కోట్లు దోచుకొని ఆ భారం మొత్తం ప్రజలపై వేయడాన్ని సరికాదని హెచ్చరించారు. కిరాయి ఇళ్లలో ఉండే వారికి ఇల్లు కిరాయి 2000 ఉంటే, కరెంట్ బిల్లు 3000 వస్తుందని లబోదిబో మంటున్నారని, దీని మూలంగా ఇంటి ఓనర్‌కు, కిరాయి దారునికి గొడవలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర విద్యుత్ నియంత్రణ సంస్థ రాష్ట్రాలపై కఠిన ఆంక్షలు ఉంచితేనే బాగుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చార్జీలపైన వెనక్కి తగ్గి నియంత్రించే వరకు ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కమిటీ నాయకులు వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఆటల పోటీలు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అభంగపట్నం గ్రామంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు ఆటల పోటీలు శనివారం నిర్వహించారు. ఆటల పోటీలలో భాగంగా బీడీలు చుట్టుట, కుర్చీ ఆట, ముగ్గులు వేయడం లాంటి పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన బీడీ కార్మికులకు బహుమతులను ప్రదానం చేశారు. ఇందులో మొదటి బహుమతి గంగామణి, రెండవ బహుమతి సుజాత, మూడవ బహుమతి రేఖ దక్కించుకున్నారు. అదేవిధంగా ముగ్గుల పోటీలలో ప్రథమ స్థానంలో కళ్యాణి, ద్వితీయ స్థానంలో అపూర్వ, తృతీయ స్థానంలో మౌనిక ప్రతిభను చాటారు. ఆటల పోటీలలో బీడీ కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వినోద, రేఖ, సుజాత, రమ్య, కవిత, సుగుణ, సాయినాథ్, గంగాధర్, లింబాద్రి, గంగాధర్, సాయిలు, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులతో బీడీ కార్మికులు

క్షత్రియలో ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ శివారు క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్మెంట్ ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేనేజ్‌మెంట్ విద్యా చాలా విశిష్టమైనదని, ప్రతి నైపుణ్యం కలిగిన విద్యార్థి గ్రామీణ వ్యవసాయ సంబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. నలుగురితో కలిసి పని చేస్తూ సంస్థాగత లక్ష్యాలను సాధించడం మేనేజ్‌మెంట్ నిపుణుల గొప్ప లక్షణాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమానికి క్షత్రియ కళాశాలల కార్యదర్శి శ్రీ అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి శ్రీ అల్జాపూర్ గంగాధర్ విచ్చేశారు. శ్రీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. పీజీ చదువుతున్న విద్యార్థులు కష్టపడి తమ లక్ష్యాలను సాధించుకోవాలని అదేవిధంగా విద్యార్థినీలు కేవలం వివాహం కారణంగా విద్య ఉద్యోగాలను త్యాగం చేయవద్దని వివాహమైన తర్వాత కూడా చదువులు కొనసాగించాలని ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వివిధ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఆర్కె పాండే మాట్లాడుతూ.. విద్యార్థులకు హాజరు అత్యవసరమని ప్రతిరోజు తరగతులకు హాజరవడం ద్వారా కొత్త కొత్త కాన్సెప్ట్ నేర్చుకుంటారని తద్వారా వారు నిత్యజీవితంలో మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఉపయోగపడతారని అన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ హెచ్ఓడీ డాక్టర్ సుధాకర్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎంబీఏ డిపార్ట్మెంట్ పాశం సుధాకర్, ప్రతిమ, చక్రధర్, అనూష, ఇతర విభాగాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

రక్తదానం మహాగొప్పది

• భైంసా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇద్రిస్ గోరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



రక్తదానం చేస్తున్న పలువురు

రక్తదానానికి మించిన దానం మరొకటి లేదని.. ఆపదలో ఉన్నప్పుడు ఒక చుక్క కూడా ఎంతోవిలువైనదని, ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న బాధిత కుటుంబాలకు ఆదుకునే వారమవుతామని భైంసా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇద్రిస్ గోరి, డిచ్‌పల్లి టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్‌రావు, టోల్‌ప్లాజా మేనేజర్ చలపతిరావు అన్నారు. శనివారం ఇందల్‌వాయి టోల్‌ప్లాజాలో కామారెడ్డి రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భైంసా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇద్రిస్ గోరి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మెయింటెనెన్స్ మేనేజర్ గౌరీ నాయుడు, అకౌంటెంట్ హేడ్ అరవింద్ కృష్ణ, వీరబాబు, టోల్ ప్లాజా సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదవ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిసెంబర్ 18న ఆర్మూర్ సాంఘిక సంక్షేమ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలో డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి క్రీడాకారులు బి.సంతోష్, జి.వినయ్, ఆర్.మురళి పాల్గొని ప్రబబుల్స్ జట్టుకు ఎంపికయ్యారు. గత వారం రోజులుగా ఆర్మూర్‌లో జరుగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి తుది జట్టుకు ఎంపికై ఈనెల 21 నుంచి 23 వరకు అంబేద్కర్ స్టేడియం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరుగుతున్న పోటీలో పాల్గొంటున్నట్టు మిట్టపల్లి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్ రావు, సర్పంచ్ తేలు గణేష్, ఎంపీటీసీ బాలగంగాధర్, ఎస్ఎంసీ చైర్మన్ మాసిపెద్ది శ్రీనివాస్, గ్రామపెద్దలు ఓడ్డం నర్సయ్య, గంగ రత్నం, స్కూల్ రాజన్న, గోపు వెంకన్న, గోపు రాజేశ్వర్, గుండా అశోక్, పశువుల మాణిక్యం, గ్రామ యువకులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.